# కొత్తనీరు

"ఏమయ్యా సోమసుందరం! ఎన్నాళ్ళయింది నువ్వు ఈ డిపార్టుమెటులో చేరి?"

"పాతికేళ్ళు సార్"

"సిల్వర్ జూబ్లీ చేసుకున్నావన్నమాట. అయినా ఏం లాభం? గాడిదకు కూడా వస్తాయి ఏళ్ళు."

"అసలేమయిందండీ ఇప్పుడు"? సోమసుందరంలో ఉక్రోషం.

"ఏం కాలేదనడుగు. సీనియర్ హ్యాండువిగదా అని నీమీద నమ్మకంతో నీ ఇనిషియల్స్ చూసి సంతకం చేసుంటే నా పరువుపోయేది."

"మీరే విషయం మాట్లాడుతున్నారో నాకర్థం కావడంలేదు."

"ఇలాంటివి నీకర్థం కావు. ఎలా అర్థమవుతాయి? ఈ ఆఫీసులో సీనియర్ మోస్టవని విర్రవీగడం తెలుసు. క్లర్కుల మీద మండిపడడం తెలుసు. లేడీ స్టాఫ్ వైపు గుడ్లు మిటకరించి చూడడం తెలుసు. అస్తమానం నష్యం పీల్చడం తెలుసు. ఆఫీసు రూల్సు మాత్రం తెలియవు. ఆ క్రాంతిసాగర్‌గారు నా దృష్టికి తేబట్టి సరిపోయింది గానీ లేకపోతే కొంపమునిగేది."

ఆ ఏ.సి. రూములో కూడా సోమసుందరానికి ముచ్చెమటలు పట్టాయి. తను కావాలనే చాలా తప్పులు చేశాడు, మేనేజరును ఇరికించాలని. ఇప్పుడు వాటిలో దేని గురించి మాట్లాడుతున్నాడో అర్థం కావడంలేదు. 'మౌనం సర్వభూషణం' అని ఊరుకున్నాడు. "దిష్టి బొమ్మలా అలా నుంచోడం కాదు. కాస్త ఒళ్ళు దగ్గర పెట్టుకొని పనిచేయి. పిల్లి చేష్టలు, పిల్ల చేష్టలు మాని హుందాగా ప్రవర్తించు. నీ సర్వీసుకి న్యాయం చేయ్. పెద్దరికం కాపాడుకో. వెళ్ళి ఆ క్రాంతిసాగర్ గారిని కలువ్. నువ్వేం తప్పు చేశావో చెబుతాడు." బయటిదారి చూపించాడు మేనేజర్. నిన్నగాక మొన్న వచ్చిన కుర్రకుంక నాకు చెబుతాడా అని మనసులో అనుకుంటూ మేనేజరు గదిలోంచి బయటపడ్డాడు సోమసుందరం.

సోమసుందరం మనసు కుతకుత లాడుతోంది. ఇన్నేళ్ళ సర్వీసులో ఎంతోమంది మేనేజర్లు వచ్చారు. పోయారు. అందరూ తనని గౌరవించారు. తన ఆధిపత్యాన్ని అంగీకరించారు. ఈ మేనేజరు మాత్రం కొరకరాని కొయ్య. అఖండుడు. ఒక్కొక్కటిగా తన లొసుగులన్నీ బయటపెడుతున్నాడు. అందరిముందు తనని ఎండగడుతున్నాడు. అతన్ని ఇబ్బంది పెట్టడానికి తను త్రవ్వే గోతుల్లోకి, తననే తోస్తున్నాడు. ఆ క్రాంతి సాగర్ వచ్చాక తన పరిస్థితి మరీ దిగజారుతోంది. ఇది ఇలా సాగనిస్తే తన ఉనికికే ముప్పు వస్తుంది. లాభంలేదు. తన అమ్ములపొది నుంచి మరో మంచి అస్త్రం తీయాలి. వీళ్ళిద్దరిని ఏదో ఒక కేసులో ఇరికించాలి. మళ్ళీ తలెత్తకుండా, తనవైపు కళ్ళెత్తి చూడకుండా చేయాలి. సాయంత్రం దాకా అలా ఆలోచిస్తూనే ఉన్నాడు సోమసుందరం. క్రాంతి సాగర్‌ను కలవకుండానే ఇంటికి బయలుదేరాడు.

"మావాడికి గుత్తొంకాయ కూర ఎంతో ఇష్టమని, ఎన్నో మసాలాలు దట్టించి, ఎంతో శ్రమపడి చేస్తే, నువ్వేమిటి అలా మొహం మాడ్చుకున్నావు?"

సోమసుందరం ఇంట్లో అడుగుపెట్టేసరికి కనకమ్మ, కోడలు మీద విరుచుకు పడుతోంది. కోడలు సవిత చీరకొంగుతో కళ్ళొత్తుకుంటోంది.

మామగారిని చూసి సవిత వంటింట్లోకెళ్ళింది. కనకమ్మ ఏదో చెప్పబోతే కళ్ళతోనే వారించి, బ్యాగు టీపాయిపై పెట్టి, తువ్వాలు తీసుకుని బాత్రూంలోకి వెళ్ళాడు సోమసుందరం. మూతి, ముక్కు విరుచుకుంటూ, తన కూతురున్న గదిలోకి వెళ్ళింది కనకమ్మ. స్నానం చేసి రాగానే టిఫిన్ ప్లేటు అందించిన సవితతో "ఏమైందమ్మా" అన్నాడు సోమసుందరం.

"పెద్దగా ఏంలేదు మామయ్యా! మా పుట్టింట్లో మేము వంకాయకూర కొత్తగా చేస్తామని చెబితే, మీ అబ్బాయి నిన్నదోర వంకాయలు తెచ్చారు. సాయంత్రం నేను

బట్టలు ఉతికే పనిలో ఉన్నాను. ఇంతలో అత్తగారు, ఆ వంకాయలతో గుత్తొంకాయ కూర చేశారు. ఆనక మీ అబ్బాయికి నేనేం చెప్పేది?"

"గుత్తొంకాయ కూర చేసిన్నాడు మనబ్బాయి నాలుగు ముద్దలు ఎక్కువ తినడం మీకు తెలీదా? మీకు మాత్రం గుత్తొంకాయ ఎంతిష్టమని? మనబ్బాయికి ఏదిష్టమో నవమాసాలు మోసి, పెంచి, పెద్దచేసిన నాకు తెలుసా? నిన్నగాక మొన్న వచ్చిన ఈ కుర్రదానికి తెలుసా?" భర్తని నిలదీసింది కనకమ్మ. చివరి మాటలు ఎక్కడో విన్నట్టనిపించాయి సోమసుందరానికి. "అది నిజమేనే కాని, కోడలు పిల్ల ఏదో కొత్తరకంగా చేస్తుందట."

"ఏంటా కొత్తరకం? వంకాయపులుసు చేస్తారు. లేకపోతే గుత్తొంకాయ చేస్తారు. నాకు తెలియని కూర ఈవిడగారు చేస్తుందా?"

వంకాయ కూరంటే చెవికోసుకొనే సోమసుందరానికి ఈ కొత్తరకం కూరేదో తెలుసుకోవాలని వుంది. తినాలని వుంది. "అమ్మా, సవితా! ఆ కొత్త రకమేదో తినాలని వుంది. అది ఎలా చేస్తారమ్మా?"

"అది వంకాయ గుజ్జుతో చేస్తాం మామయ్యా! వంకాయలను కాల్చి, తొక్కతీసి పారేస్తారు. మిగిలిన గుజ్జుతో కారం, ఉప్పు, ఉల్లిపాయలు, నువ్వుల పొడివేసి తాలింపు వేస్తారు. కొన్ని నీళ్ళు పోసి మరగబెడతారు. కూర ఉడకగానే వేడివేడిగా తింటే ఎంత బావుంటుందో! సోమసుందరానికిప్పుడే నీళ్ళూరాయి.

"నీకు తెలీని రకాలు కూడా ఉంటాయి కనకం. అనవసరంగా కోడలు పిల్ల మనసు నొప్పించావు."

"ముందొచ్చిన చెవులకంటే వెనక మొలిచిన కొమ్ములు వాడి అన్నట్టు. అబ్బాయి పెళ్ళయి నెల తిరగలేదు, అప్పుడే కోడలిని వెనకేసుకొస్తున్నారు."

"అదికాదే... సోమసుందరం నీళ్ళు నమల సాగాడు. ఇంతలో

"అమ్మమ్మా, అమ్మమ్మా! అమ్మెప్పుడూ బుజ్జితోనే ఉంటుంది. నన్నెప్పుడూ దగ్గరకు తీసుకోదు. నేనేమడిగినా 'పోయి అమ్మమ్మ నడుగు' అంటుంది". నాలుగేళ్ళ సుమంత్ ఫిర్యాదు చేశాడు.

సుమంత్ సోమసుందరం కూతురి కొడుకు. వాళ్ళమ్మాయి అత్తవారు ఊళ్ళోనే ఉంటారు. అమ్మాయికి మలికాన్పు కూతురు. ఆర్నెల్ల క్రితం పురుడయింది. అబ్బాయి పెళ్ళి హడావిడితో కాన్పుకి తీసుకురావటానికి కుదరలేదు. రెండు రోజుల క్రితమే పుట్టింటికి వచ్చింది నయన.

బుజ్జి, చిన్న పిల్ల కదనాన్నా! అందుకే అన్నింటికీ అమ్మ కావాలి. నువ్వేమో పెద్దవాడివి. నీ పనులు నీవే చేసుకోవాలి" కనకమ్మ బుజ్జగింపు.

"అలా ఏంకాదు. నేను పెద్దవాన్ని కదా, అమ్మ నామాటే వినాలి. ఇంతకు ముందేమో అమ్మ నన్నెంతో గారం చేసేది. పాటలు పాడేది. నేను అడిగినవన్నీ ఇచ్చేది. ఇప్పుడేమో దగ్గరికెళ్లితే, కసురు కుంటోంది. నాలుగేళ్ళొచ్చాయి ఇంకా నీ పనులు చేసుకోలేవా? అని కోపపడుతోంది. అమ్మకిప్పుడు మునపటి నుంచి ఉన్న నాకంటే, మొన్న మొన్న వచ్చిన బుజ్జంటేనే ఇష్టం."

సోమసుందరం ఉలిక్కిపడ్డాడు. ఆ చివరి మాటలు ఎక్కడో విన్నట్టనిపించాయి. సుమంత్‌ను దగ్గరకు తీసుకుని "అలా ఏంకాదు నాన్నా. అమ్మకి నువ్వంటే కూడా చాలా ఇష్టం. నాతో ఎన్నోసార్లు నీ గురించి చెప్పింది. నువ్వు తన బంగారు కొండవంది. నీమీద ఎంత ప్రేమో! సోమసుందరం మనవణ్ణి బుజ్జగించాడు. ఆఫీసులోని అవమానంతో అసలే విసుగ్గా ఉన్న సోమసుందరానికి, ఇంట్లోని కీచులాటలు మరింత మనస్తాపం కలిగించాయి. పడకగదిలో కెళ్ళి నడుంవాల్చాడు. ఆనాటి దినపత్రిక చేతిలోకి తీసుకున్నాడు.

"వృద్ధనేతలు కొత్త రక్తానికి చోటు కల్పించాలి" – యువనేత శ్రీ...'

సోమసుందరం ట్యూబులైటు వెలిగింది. ఆ రోజు పదే పదే విన్న మాటల సందర్భాలు గుర్తొచ్చాయి. ఆధిపత్యం పట్ల ఆరాటమే అనర్థాలన్నింటికీ మూలం అని గ్రహించాడతను. జ్ఞానోదయమైంది. 'మర్నాడు ఆఫీసు చేరగానే చేయవలసిన మొట్టమొదటి పని, క్రాంతి సాగర్‌ను కలవడం' గట్టిగా అనుకున్నాడు సోమసుందరం.